

డిప్యూటీ కలెక్టర్, ఏఎస్పీ బదిలీ

పార్వతీపురం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు యూనిట్-3 భూసేకరణ విభాగంలో పనిచేస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.మురళీకృష్ణకు విశాఖపట్నం బదిలీ అయ్యింది. ఆయన స్థానంలో పి.వెంకటరమణను నియమిస్తూ మంగళవారం ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అదేవిధంగా మన్యం జిల్లా పరిపాలనా విభాగం ఏఎస్పీ ఓ.దిలీప్ కిరణ్‌కు కూడా స్థానచలనం కల్పించారు. జిల్లా ఏర్పాటైనప్పటి నుంచి ఇక్కడ పనిచేస్తున్న ఆయన్ని ఏసీబీ ఏఎస్పీగా బదిలీ చేస్తూ.. ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

అనాలోచిత నిర్ణయం

బహుళ అసౌకర్యం

- బహుళ ప్రయోజన సౌకర్య గోదాముల పేరిట గత వైసీపీ సర్కారు హడావుడి
- రహదారి సౌకర్యం లేని చోట్ల .. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు
- పీఏసీఎస్‌ల పరిధిలో గోదాములు ఉన్నా.. అనువుకాని చోట్ల గోడౌన్ల కట్టడాలకు చర్యలు
- వాటి వల్ల ఎవరికి ప్రయోజనమంటూ రైతుల మండిపాటు
- కాంట్రాక్టర్లకే మేలు అంటూ పెదవి విరుపు

పాలకొండ, జనవరి7 (ఆంధ్రజ్యోతి): బహుళ ప్రయోజన సౌకర్య గోదాముల పేరిట గత వైసీపీ ప్రభుత్వం హడావుడి చేసింది. జిల్లాలోని అన్ని పీఏసీఎస్‌లకు గోదాములు ఉన్నప్పటికీ.. 500, 600ల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో అదనంగా గోడౌన్‌ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అయితే గత ప్రభుత్వం అనాలోచిత నిర్ణయం వల్ల కాంట్రాక్టర్లకే మేలు జరిగిందని, రైతులకు ఒరిగిందేమీ లేదనే వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి. కోట్లాది రూపాయల వ్యయంతో అనువుకాని చోట నిబంధనలకు విరుద్ధంగా గోదాములు నిర్మించడం వల్ల ఏం ప్రయోజనమని జిల్లావాసులు ప్రశ్నిస్తున్నారు. జిల్లా అంతటా రహదారులు లేని చోట వాటిని నిర్మించడంపై రైతులు పెదవి విరుస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

- జిల్లాలోని 23 పీఏసీఎస్‌లు ఉన్నాయి. దాదాపు అన్నింటికీ గోదాములు ఉన్నాయి. అయినప్పటికీ గత ప్రభుత్వం బహుళ ప్రయోజన సౌకర్యం పేరుతో ప్రతి పీఏసీఎస్ పరిధిలోని గోదాములు నిర్మాణానికి చర్యలు చేపట్టింది. ఈ మేరకు జిల్లా స్థాయి కమిటీలు కూడా ఏర్పాటు చేసింది. కలెక్టర్ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ కమిటీలో తహసీల్దార్, ఎంపీడీవో, పంచాయతీరాజ్, జిల్లా సహకార సంఘ అధికారులతో పాటు మరికొంతమంది అధికారులు సభ్యులుగా ఉన్నారు. వారి నిర్ణయం మేరకు గోదాముల నిర్మాణాలు చేపట్టాలని గత ప్రభుత్వం ఆదేశించింది. అయితే నిబంధనల మేరకు పనులు జరగలేదు. 20 పీఏసీఎస్‌ల పరిధిలో గోదాముల నిర్మాణానికి సుమారు రూ.10 కోట్ల వరకు వెచ్చించినట్లు అధికారుల లెక్కల ద్వారా తెలుస్తోంది.
- జిల్లాలో పాలకొండ, భామిని, బత్తిలి, అజ్జాడ, కొమరాడ, గెడ్డలుపిలో ఈ గోదాములు నిర్మాణం పూర్తయింది. ఎస్‌నర్సిపురం, ఎం.సింగుపురం, చంద్రయ్యవలస, యు.వెంకమ్మపేటలో ఈ నెలాఖరుకు పనులు పూర్తి కానున్నాయి. మరో పది గోదాములు మార్చి నాటికి సిద్ధం చేస్తామని ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు.



పాలకొండ మండలం చంద్రయ్యవలస వద్ద నిర్మించిన అరలి పీఏసీఎస్ గోదాము ఇలా..




మల్లమ్మగూడలో రహదారి లేని చోట పాలకొండ పీఏసీఎస్ గోదామును నిర్మించిన దృశ్యం

రహదారులు లేని చోట్ల ...

- పీఏసీఎస్‌లకు అందుబాటులో ఉండేలా గోదాములు నిర్మించడం వల్ల రైతులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. ఎరువులు, విత్తనాలు తదితర వాటిని నిల్వ చేసుకునే అవకాశం ఉంటుంది. అదేవిధంగా వాతావరణ ప్రతికూల పరిస్థితులు, మార్కెటింగ్ అనుకూలంగా లేని సమయంలో వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసుకునేలా గోదాముల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. అయితే క్షేత్రస్థాయిలో ఆ దిశగా పనులు చేపట్టలేదు.
- ప్రతి పీఏసీఎస్‌కు ఏడు నుంచి పది కిలోమీటర్ల దూరంలోనే ఈ గోదాములను నిర్మిస్తున్నారు. వ్యవసాయ ఉత్పత్తులు, ఎరువులను తదితర వాటిని రవాణా చేసేందుకు వీలు లేని చోట.. రహదారులు లేని ప్రాంతాల్లో వాటి నిర్మాణం చేపడుతున్నారు. ఇలా చేపట్టవద్దని జిల్లాలో పలు పీఏసీఎస్‌ల నుంచి వ్యతిరేకత వచ్చినప్పటికీ పట్టించుకున్న వారే కరువయ్యారు.
- పాలకొండ పీఏసీఎస్‌కు సుమారు ఏడు కిలోమీటర్ల దూరంలో మల్లమ్మగూడ అనే గిరిజన గూడలో గోదాము నిర్మించారు. అయితే ఈ గోదాముకు వెళ్లేందుకు రహదారి సౌకర్యం పూర్తి స్థాయిలో లేదు. భారీ వాహనాలు వెళ్లలేని పరిస్థితి. పాలకొండ మండలం అరలి, ఆర్‌బీఆర్‌పేట, పీఏసీఎస్‌లకు సంబంధించి ఎల్‌ఎల్‌పురం పంచాయతీ చంద్రయ్యవలస అనే గిరిజన ప్రాంత సమీపంలో రూ.80 లక్షలతో రెండు గోదాములను సిద్ధం చేశారు. చంద్రయ్యవలసకు వెళ్లేందుకు సరైన రహదారి సౌకర్యం లేదు.
- భామిని మండలంలో బత్తిలి పీఏసీఎస్ గోదామును పది కిలోమీటర్ల దూరంలో ఉన్న బిల్లుమడ వద్ద నిర్మించారు. ఈ గోదాముకు వాహనాలు

(మిగతా 8వ పేజీలో...)



హెచ్‌ఎంపీవీపై ఆందోళన వద్దు

- వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి
- డీఎంహెచ్‌వో భాస్కరరావు



పార్వతీపురం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): చైనాలో గుర్తించిన కొత్త వైరస్ హెచ్‌ఎంపీవీ (హ్యూమన్ మెటాన్యూమో వైరస్)పై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డీఎంహెచ్‌వో భాస్కరరావు తెలిపారు. మంగళవారం తన కార్యాలయం నుంచి పీహెచ్‌సీ వైద్యులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. హెచ్‌ఎంపీవీపై క్షేత్రస్థాయిలో అందరికీ అవగాహన కల్పించాలన్నారు. చిన్నారులు, వృద్ధులు, వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిని అప్రమత్తం చేయాలని సూచించారు. దగ్గు, జలుబు, తుంపరల ద్వారా వైరస్ వ్యాప్తి చెందుతుందని తెలిపారు. జిల్లాలో వైరస్ ప్రభావం లేనప్పటికీ వైద్యులు, వైద్య సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పండగ సమయం కావడంతో ప్రజలు కూడా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎటువంటి సందేహం ఉన్నా వెంటనే సమీపంలోఉన్న ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లా ప్రోగ్రాం అధికారి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

- వీరఘట్టం: బీటీవాడ పీహెచ్‌సీని మంగళవారం డీఎంఅండ్‌హెచ్‌వో ఎస్.భాస్క రరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. హెచ్‌ఎంపీవీ వైరస్‌పై అవగాహన ఉండాలని, ముందు జా గ్రత్త చర్యలు తీసుకోవాలని ఆయన సిబ్బందికి సూచించారు. రక్తహీనత కమిటీల పనితీరును పర్యవేక్షించాలన్నారు.

వైభవంగా పెదపోలమాంబ ఉత్సవం

6లో

- ఘటాలకు ప్రత్యేక పూజలు
- తరలివచ్చిన భక్తులు
- నేడు అంపకోత్సవం

చారిత్రక సాక్ష్యాలు..

చెరగని జ్ఞాపకాలు

6లో

- బ్రిటిష్ కాలం నాటి నిర్మాణాలు నేటికీ పదిలం
- 120 ఏళ్లుగా సేవలందిస్తున్న తోటపల్లి రెగ్యులేటర్
- ప్రభుత్వ కార్యాలయాలుగా నాటి భవనాలు



వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

- డీఈవో తిరుపతినాయుడు

గరుగుబిల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని డీఈవో తిరుపతి నాయుడు అన్నారు. మంగళవారం కొత్తూరు జడ్పీ ఉన్నత పాఠశాల, శివ్వాం యూపీ పాఠశాల, గరుగుబిల్లిలో అంబేడ్కర్ గురుకుల కళాశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు పరీక్షలపై భయం పోగొట్టే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. టెన్త్ ఫలితాల్లో జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచే విధంగా ప్రణాళికలు రూపొంది స్తున్నామని తెలిపారు. సిలబస్ పూర్తయిన తర్వాత టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆ ఫలితాల ఆధారంగా వారిని విభజన చేయాలని ఆదేశించారు. ఆరు రాత్రి సమయాల్లో ఏ మేర చదువు తున్నారన్న దానిపై పరిశీలన చేయాలన్నారు. పాఠశాలల పరిధిలో పరిశుభ్రత పాటించాలని, పిల్లలకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని ఆదేశించారు.



అంబేడ్కర్ గురుకుల కళాశాలలో మాట్లాడుతున్న డీఈవో

ఉద్యాన రైతులకు తోడ్పాటు

- జీడిపప్పు ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు: కలెక్టర్



పార్వతీపురం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జీడి పప్పు ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పేందుకు చర్యలు తీసుకోవాలని, ఈ మేరకు ఉద్యాన రైతులకు తోడ్పాటు అందించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. జీడిపప్పు మార్కెటింగ్‌లో దళారుల ప్రమేయం లేకుండా చూడాలన్నారు. వీడీవీకేల ద్వారా రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని సూచించారు. జిల్లాలో వరికి ప్రత్యామ్నాయంగా లెమన్ గ్రాస్ సాగు విస్తీర్ణం పెంచాలన్నారు. అయితే ఇప్పటికే 200 ఎకరాల్లో లెమన్ గ్రాస్ సాగు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. అయితే శ్రీనిధి, బీసీ కార్పొరేషన్ ద్వారా రైతులకు రుణాలు మంజూరు చేసి వేయి ఎకరాల్లో సాగు లక్ష్యంగా పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ-క్రాప్‌లో నమోదైన పంటలు, ఆన్‌లైన్‌లో పొందుపరిచిన వివరాలు, విస్తీర్ణ సాగు ఒకేలా ఉండేలా చూసుకోవాలన్నారు. భామిని కేంద్రం వద్ద మద్దతు ధరకు పత్తి కొనుగోలు చేయాలని ఏడీ మార్కెటింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్వో కె.హేమలత, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, డీఎఫ్‌వో ప్రసూన, జిల్లా వ్యవసాయశాఖాధికారి రాబర్ట్‌పాల్, డ్వామా, డీఆర్‌డీఏ పీడీలు కె.రామచంద్రరావు, వై.సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ లేని పంట రుణాలపై అవగాహన

వచ్చే ఖరీఫ్ సీజన్‌కు అందించనున్న రూ.లక్షలోపు వడ్డీలేని పంట రుణాలపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. బ్యాంకర్లు, వివిధ శాఖల అధికారులతో ఆయన మాట్లాడుతూ.. రబీసీజన్‌కు సంబంధించి రైతులు పంట బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. 2023 ఖరీఫ్ రుణాలను తిరిగి చెల్లించిన వారి వివరాలు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. పీఎం స్వానిధి, ముద్ర తదితర రుణాల మంజూరులో కొన్ని బ్యాంకులు వెనుకబడి ఉన్నాయన్నారు.

పక్కాగా భూముల రీసర్వే

- అధికారులకు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ఆదేశం

పార్వతీపురం రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పక్కాగా భూముల రీసర్వే చేపట్టాలని సబ్ కలెక్టర్, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాస్తవ ఆదేశించారు. మంగళవారం గోపాలపురం గ్రామంలో నిర్వహించిన రీసర్వే ప్రారంభోత్సవ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో చేపడుతున్న రీసర్వేను పరిశీలించారు. భూమల రీసర్వే ప్రక్రియ, వెరిఫికేషన్ సమయంలో ఉండాల్సిన పత్రాలు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సరైన పత్రాలు లేకుండా వెబ్ ల్యాండ్‌లో పేరు మార్చొద్దని సిబ్బందికి సూచించారు. రైతుల భూములన్నింటినీ రీసర్వే చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, స్థానికులు, రైతులు పాల్గొన్నారు.

సబ్‌ప్లాన్ మండలాల్లో వసతులు..

ఐటీడీఏ పరిధిలోని ఎనిమిది సబ్‌ప్లాన్ మండలాల్లో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు పక్కాగా అమలు కావాలని ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాస్తవ ఆదేశించారు. ఐటీడీఏ కార్యాలయంలో వివిధ శాఖాధికారులతో సమీక్షించారు. సబ్‌ప్లాన్ మండలాల్లో రోడ్ల నిర్మాణం, వీడీ వీకేల నిర్వహణపై వివరాలు అడిగి తెలుసు కున్నారు. ఉపాధ్యాయుల ప్రమోషన్లు, వసతిగృహాలు, పాఠశాలల మౌలిక వస తులు, వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. ఏఎన్‌ఎంలు వారంలో రెండుసార్లు పాఠశా లలను సందర్శించాలని ఆదేశించారు. విద్యుత్, వ్యవసాయం, ఉద్యాన పంటలు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు.



ర్యాలీలో పాల్గొన్న సబ్ కలెక్టర్

రూ.300 కోట్లతో

రహదారుల నిర్మాణం

- పాచిపెంట పేరు మారుస్తా..
- గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి

8లో

కన్నులపండువగా పుష్పయాగం

- బొబ్బిలి వేణుగోపాలస్వామి ఆలయానికి భారీగా హాజరైన భక్తులు



6లో

మొదటి విడత పూర్తి

- ముగిసిన దివ్యాంగ పింఛన్ల తనిఖీలు
- నకిలీల పరివేతకు నివేదికలు సిద్ధం

గరుగుబిల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నకిలీ దివ్యాంగుల పింఛన్ల ఏరివేతకు ప్రత్యేక వైద్య బృందం చేపట్టిన మొదటి విడత తనిఖీలు ముగిశాయి. ఈ నెల 6, 7 తేదీల్లో 14 మండలాల పరిధిలో వారు పర్యటించారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన 8 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్ల సారథ్యంలో 28 మంది వైద్యుల బృందం రెండు రోజుల పాటు పూర్తిస్థాయిలో పరిశీలన చేశారు. నాలుగు బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేపట్టారు. 92 మంది దివ్యాంగుల గృహాలకు వెళ్లి వివరాలు సేకరించారు. రూ.15 వేలు దివ్యాంగ పింఛన్ పొందు తున్న మంచాలపై లేవలేని స్థితిలో ఉన్న దివ్యాంగులు, డయాలసిస్, పెరాలసిస్ వంటి సమస్యలతో సతమతమవుతున్న వారి ధ్రువప్రతాలు నిశితంగా పరిశీలించి నివేదికలు రూపొందించారు. వాటిని త్వరలో ప్రభుత్వానికి అందజేయనున్నారు. కాగా మంగళవారం గరుగుబిల్లి మండలం ఉల్లిభద్ర, రావుపల్లి, పెద్దూరు, దళాయివలస, సంతోషపురం పంచాయతీల్లో విచారణ చేపట్టారు. ఈ తనిఖీల్లో వైద్యులు రవికుమార్, నరసింగరావు, సాగర్‌వర్మ, సంతోషకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెండో విడతలో..

రెండో విడతలో రూ. 6 వేలు పొందుతున్న దివ్యాంగుల పింఛన్లను తనిఖీ చేయనున్నారు. నకిలీలను గుర్తించేందుకు కొద్దిరోజుల్లో ప్రభుత్వం ప్రత్యేక యాప్‌లను సచివాలయాల సిబ్బందికి అందించనుంది. ప్రస్తుతం జిల్లాలో 1,42,393 పింఛన్లను పరిశీలించిన అనంతరం నూతన పింఛన్లు మంజూరు చేయనున్నారనే వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఇప్పటికే పలు సచివాలయాల పరిధిలో అర్హుల జాబితా సిద్ధంగా ఉంది. ప్రభుత్వ ప్రకటన కోసం వారంతా ఆశగా ఎదురు చూస్తున్నారు. నిబంధనల మేరకు అర్హత ఉన్నవారికి పింఛన్ అందించాలని కోరతున్నారు.



పెద్దూరులో మంచంపై ఉన్న దివ్యాంగుని వివరాలు సేకరిస్తున్న వైద్య బృందం

చారిత్రక సాక్ష్యాలు.. చెరగని జ్ఞాపకాలు

- బ్రిటిష్ కాలం నాటి నిర్మాణాలు నేటికీ పదిలం
- 120 ఏళ్లుగా సేవలందిస్తున్న తోటపల్లి రెగ్యులేటర్
- ప్రభుత్వ కార్యాలయాలుగా నాటి భవనాలు



బ్రిటిష్ కాలం నాటి భవనమే నేటి తహసీల్దార్ కార్యాలయం

ఆధునిక యంత్రాలు లేవు. సౌకర్యాలు లేవు. టెక్నాలజీ వినియోగానికి దూరం. వీటన్నిటితో పాటు అడవుల మధ్యలో నిర్మాణాలు. ఇప్పటికీ సరైన రహదారులు లేవంటే... వందేళ్ల కిందట ఎంత ఇబ్బందిగా ఉంటుందో ఊహించుకోవచ్చు. ఈ సమస్యలన్నిటినీ దాటి... నిర్మించిన భవనాలు ఇప్పటికీ పదిలంగా ఉన్నాయి. సేవలందిస్తున్నాయి. అప్పుడెప్పుడో నిర్మించిన కాలువలు ఇప్పటికీ రైతులను ఆదుకుంటున్నాయి. ఇదీ పాలకొండ ప్రాంతంలోని బ్రిటిష్ కాలం నాటి కట్టడాల గొప్పతనం.

పాలకొండ, జనవరి 7(ఆంధ్రజ్యోతి):

బ్రిటిష్ కాలం నాటి ఇంజనీరింగ్ విధానం ఎంత గొప్పదో చాటి చెప్పేందుకు ఇప్పటికీ వినియోగంలో ఉన్న నాటి నిర్మాణాలే ఉదాహరణ. ఒక పక్క నాణ్యమైన... నిబంధనలతో కూడిన కట్టడాలు, వాస్తుశాస్త్రంపై పట్టు వీటిలో కనిపిస్తోంది. మన్యం జిల్లాలో బ్రిటిష్ కాలం నాటి అనేక నిర్మాణాలు నేటికీ పదిలంగా ఉన్నాయి. అందుకు తోటపల్లి పాత రెగ్యులరేటర్‌ను ఉదాహరణగా చెప్పవచ్చును. 120 ఏళ్ల చరిత్ర ఉన్న తోటపల్లి పూర్వపు రెగ్యులేటర్ ఎడమ, కుడి కాలువల డిజైనింగ్ నేటికీ అద్భుతమే. ఆయకట్టుకు అవసరమైన సాగునీరును అందించేందుకు బ్రిటిష్ వారు చేసిన కాలువల డిజైనింగ్, రైతులకు అవసరమైన సాగునీరు పంపిణీ ఎంతో ఘనంగా ఉండేది. ఇటీవల కాలంలో మన ప్రభుత్వాలు అడపాదడపా చేపడుతున్న నిర్మాణాలు మూణ్నాళ్ల ముచ్చటగానే ఉంటున్నాయి. ఐదేళ్లు కాకముందే ఆ నిర్మాణాలు బీటలు వారి శిథిలమవుతున్నాయి. తోటపల్లి రెగ్యులేటర్‌ను 120 ఏళ్ల క్రితమే నాగావళి నదిపై నిర్మించారు. కుడి కాలువను 18 కిలోమీటర్ల మేర నిర్మించి... 25 వేల ఎకరాలకు అప్పట్లోనే సాగునీరు అందించారు. సుమారు 40 కిలోమీటర్ల మేర ఎడమ కాలువను నిర్మించి 40 వేల ఎకరాలకు సాగునీరు అందించేలా డిజైన్ చేశారు. ప్రస్తుతం ఈ ఎడమ, కుడి కాలువల ద్వారానే సాగునీరు రైతాంగానికి అందుతోంది. ప్రభుత్వాలు ఎన్ని మారినా.... కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టినా బ్రిటిష్ కట్టడాల ముందు తీసికట్టే. ప్రధానంగా స్లూయిస్‌లు, అండర్ టన్నెల్స్, సైఫాన్‌లు, బ్రాంచి కాలువలకు షట్టర్లు ఏర్పాటు, అక్విడెక్ట్‌లను ఎంతో సుందరంగా రాతికట్టుతో తీర్చిదిద్దారు. వీటి ద్వారానే రైతులకు సాగునీరు అందుతోంది. 2005లో తోటపల్లి కాలువల ఆధునికీకరణకు కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కాలువల విస్తరణ పనులు చేపట్టారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వాలు మారుతున్నా అనుకున్న స్థాయిలో సాగునీరు అందడం లేదు. అప్పటి బ్రిటిష్ టెక్నాలజీ ఎంత పటిష్టమో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు.


పాలకొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం


ఓని గెడ్డపై నిర్మించిన 120 ఏళ్ల నాటి అక్విడెక్ట్

ప్రభుత్వ కార్యాలయాలుగా...

సవరదొర రాజుల తర్వాత పాలకొండ ప్రాంతాన్ని బ్రిటిష్ వారు పాలించారు. అప్పట్లో వారు చేపట్టిన నిర్మాణాల్లోని కొన్ని భవనాలు నేటికీ పదిలంగా ఉన్నాయి. డివిజన్ కేంద్రమైన పాలకొండలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, సబ్ ట్రెజరీ, తహసీల్దార్ కార్యాలయం, కోర్టు భవనాలలో నేటికీ కార్యకలాపాలు సాగుతున్నాయంటే అప్పటి నిర్మాణాలు ఎంత ధృఢమైనవో ఇట్టే అర్థమవుతుంది. వందేళ్లు దాటినా ఈ భవనాలు చెక్కుచెదరకుండా ఉన్నాయి. విలాసవంతమైన భవనాలుగా వీటిని అప్పటి బ్రిటిష్ వారు తీర్చిదిద్దారు. పాలకొండలో మన పాలకులు 20 ఏళ్ల కిందట నిర్మించిన భవనాలే ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్న పరిస్థితులు ఉన్నాయి. అదే వందేళ్ల క్రితం నిర్మించిన భవనాలు మాత్రం చెక్కు చెదరడం లేదు.


బ్రిటిష్ కాలం నాటి ఈ కాలువే నేటికీ ఆధారం



గోడౌన్‌గా అంగన్‌వాడీ కేంద్రం

గరుగుబిల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రావివలస అంగన్‌వాడీ కేంద్ర భవనం గోడౌన్‌లా తయారైంది. పార్వతీపురం ఐటీడీఏ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ భవన నిర్మాణ పనులు అర్థాంతంగా నిలిచిపోయాయి. దీన్ని పూర్తి చేయడానికి అధికారులు చొరవ చూపలేదు. ప్రస్తుతం అసంపూర్తిగా ఉన్న భవనాన్ని ధాన్యం వ్యాపారులు గోడౌన్‌గా ఉపయోగించుకుంటున్నారు. బయట నిల్వ చేస్తే అద్దె చెల్లించాల్సి ఉంటుందనే ఉద్దేశంతో దీన్ని వాడుకుంటున్నారు. అలాగే మరుపెంట పంచాయతీ సాంబన్నవలసలోని అసంపూర్తి అంగన్‌వాడీ కేంద్ర భవనాన్ని కొందరు పశువుల శాలగా ఉపయోగించుకుంటున్నారు. అసంపూర్తి భవనాల విషయమై మండల ఇంజనీరింగ్ అధికారి గౌరీశంకర్‌ను వివరణ కోరగా... నిధుల సమస్య ఉందని తెలిపారు. వీటి విషయమై ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

కన్నులపండువగా పుష్పయాగం

- పెద్ద ఎత్తున హాజరైన భక్తులు


మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను ఆశీర్వదిస్తున్న అర్చకుడు

బొబ్బిలి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలిలోని వేణుగోపాల స్వామి ఆలయంలో రెండో రోజు మంగళవారం పుష్పయాగాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త ప్రతినిధి, ఎమ్మెల్యే బేబీనాయన ఆధ్వర్యంలో సుమారు ఒకటిన్నర టన్నుల పూలతో శాస్త్రోక్తంగా ఈ యాగాన్ని నిర్వహించారు. స్థానిక కోట నుంచి ఎమ్మెల్యే బేబీనాయన స్వయంగా పూల బుట్టను తలపై మోసుకుంటూ మేళతాళాలతో ఆలయానికి తరలించారు. తొలుత దర్బారు మహల్‌లో ఈ పూలకు వేదమంత్రాలతో పూజలు చేశారు. అక్కడి నుంచి 108 వెదురుబుట్టలతో పూలను భక్తులు ఆలయానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. వాటితో స్వామి వారికి పుష్పయాగం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు అంపోలు వీరరాఘవాచార్యులు, అర్చకులు సత్యనారాయణ ఆచార్యులు, చామర్తి నరసింహాచార్యులు, భద్రం శ్రీకాంత్, కూర్మాచార్యులు, జగదీశ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో పూజలు చేశారు. పుష్పయాగం కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్రతో పాటు భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. మంత్రికి, ఎమ్మెల్యేకు బేబీనాయన స్వామి వారి చిత్రపటాలను బహూకరించారు.


పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్రకు చిత్రపటాన్ని అందజేస్తున్న బేబీనాయన


హాజరైన భక్తులు

గణతంత్ర వేడుకలకు

భూదేవికి ఆహ్వానం



పాలకొండ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సీతంపేటలో నివాసం ఉంటున్న నారీ శక్తి అవార్డు గ్రహీత పడాల భూదేవికి భారత గణతంత్ర వేడుకల్లో పాల్గొనేందుకు ఆహ్వానం అందింది. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ నుంచి ఆహ్వానం వచ్చింది. భూదేవి ఆదివాసీలతో కలిసి మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేయడం, గిరిజన ప్రాంతాల్లో పండించే ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించడం... వారికి ఆధునిక వ్యవసాయ పద్ధతులు నేర్పించడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. దీనిని గుర్తించి గణతంత్ర వేడుకలలో పాల్గొనేందుకు ఆహ్వానం పంపించారు. ఈ సందర్భంగా భూదేవి మాట్లాడుతూ... ఈ ఆహ్వానాన్ని అందుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఇది అందరి కృషి వల్లనే సాధ్యమైందని చెప్పారు. దీనితో తన బాధ్యత మరింత పెరిగిందని అన్నారు.

వైభవంగా పెదపోలమాంబ ఉత్సవం


అమ్మవారి తిరువీధి నిర్వహిస్తున్న దృశ్యం

మక్కువ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఆరాధ్యదేవత, గిరిజనుల కొంగుబంగారం శంబర పోలమాంబ అమ్మవారి మేనత్త పెదపోలమాంబ అమ్మవారి ప్రధాన ఉత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. జాతరలో భాగంగా బంగారు రంగుతో అలంకరించిన అమ్మవారి ఘటాలకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల కోలాటాలు, మంగళ వాయిద్యాల మధ్య గద్దె వద్దకు అమ్మవారి ఘటాలను తీసుకొని వెళ్లారు. అక్కడి నుంచి సంప్రదాయం ప్రకారం రెవున్నాయుడు ఇంటి వద్ద అమ్మవారి ఘటాలకు తొలి పూజ చేశారు. అనంతరం గ్రామంలో తిరువీధి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు. బుధవారం పెదపోలమాంబ అమ్మవారి అంపకోత్సవాన్ని నిర్వహిస్తారు.


ఊరేగింపులో పాల్గొన్న భక్తులు


ట్యూబుపై కూర్చొని వల వేస్తున్న మత్స్యకారుడు రమేష్

ట్యూబే ఆధారం

- చంపావతిలో చేపల వేట

ఈ చిత్రంలోని వ్యక్తి పేరు సింగిడి రమేష్. విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం సారిపల్లి గ్రామం. ముంగినాపల్లి వద్ద చంపావతి నదిలో టైరు ట్యూబ్‌పై కూర్చొని చేపల వేట సాగిస్తున్నాడు. రమేష్ తాత, తండ్రుల నుంచి చేపల వేటే ఆధారం. అది కూడా ఎటువంటి పడవలు ఉపయోగించకుండా కేవలం ఈ ట్యూబు సాయంతోనే ప్రమాదకర స్థితిలో నీటి మధ్యలోకి వెళతాడు. నెయ్య జాతి తెగకు చెందిన తాము నదులు, చెరువులు, పిల్లకాలువల్లో చేపలు వేటతో జీవనం సాగిస్తున్నామని చెబుతున్నాడు. తనకు ఇద్దరు కుమారులు ఉన్నారని.. వారిని బాగా చదివించి... ఉన్నత స్థితిలో ఉంచాలన్నదే తన ఆశయమని చెబుతున్నాడు రమేష్.

-విజయనగరం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి)



పైడిమాంబకు నృత్య నీరాజనం



విజయనగరం రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని మూడు లాంతర్లు వద్ద ఉన్న పైడితల్లికి విద్యార్థులు నృత్య నీరాజనాలు అర్పించారు. చదురుగుడి పక్కన గల కళావేదిక వద్ద 15 మంది చిన్నారులు ప్రదర్శించిన భరతనాట్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వివిధ కీర్తనలకు చిన్నారులు నృత్యం చేసిన తీరు ప్రశంసలు అందుకుంది. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌ఛార్జి ఈఓ ఎస్‌వీడీ ప్రసాద్, సూపరింటెండెంట్ ఏడుకొండలు, పైడిమాంబ ఆధ్యాత్మిక సేవా సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్.సూర్యపాత్రో, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.





పారిశ్రామిక ప్రగతికి ప్రత్యేక కృషి

● మంత్రి కొండపల్లి శ్రీనివాస్

బొబ్బిలి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పారిశ్రామికంగా ప్రగతి పరుగులు తీసేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం బొబ్బిలిలోని వేణుగోపాలస్వామి ఆలయంలో జరుగుతున్న పుష్పయాగాన్ని సందర్శించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్థానిక ఏపీఐఐసీ గ్రోత్ సెంటరు రోజురోజుకు నీరసించిపోతోందని, ఇక్కడ అధికారులు, ఉద్యోగులు ఎవరూ పూర్తిస్థాయిలో లేకపోవడంతో అందరికీ అసౌకర్యంగా ఉందని మంత్రి దృష్టికి తీసుకురాగా ఆయన స్పందించారు. ఏపీఐఐసీని బలోపేతం చేయాలన్న లక్ష్యంతో ఆ సంస్థ ఎండీని రప్పించి చర్చించామన్నారు. బొబ్బిలి గ్రోత్ సెంటరులో సదుపాయాల కల్పన చాలా అవసరమని గుర్తించామన్నారు. వాటికోసం ప్రత్యేకంగా అంచనాలు తయారు చేయించామన్నారు. పరిశ్రమల ఏర్పాటు కోసం స్థలాలు తీసుకుని ఎటువంటి యూనిట్లను స్థాపించని వారి విషయమై గట్టిగా చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు. గజపతినగరం నియోజకవర్గ పరిధిలో మరుపల్లిలో కూడా 80 ఎకరాల ఏపీఐఐసీ స్థలం వృథాగా ఉన్నట్లు గుర్తించామన్నారు. మండలానికి ఒకరు, నియోజకవర్గానికి ఒకరు చొప్పున ఐపీఓలను నియమిస్తామన్నారు. పరిశ్రమలను ఏర్పాటు చేయదలుచుకున్న వారికి ప్రభుత్వ పరంగా పూర్తిస్థాయి సమాచారం అందించేందుకు, వారిని ప్రోత్సహించేందుకు ఐపీఓలు సేవలందిస్తారన్నారు.

ఐదేళ్ల పాటు రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించి ఇప్పుడేమో కూటమి ప్రభుత్వంపై హేళనగా మాజీ మంత్రి అమర్‌నాథ్ మాట్లాడడం తగదన్నారు. ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రతిపక్షానికి చెందిన వారికి సైతం రాష్ట్ర బాగోగుల పట్ల బాధ్యత ఉండాలన్నారు. అలా కాకుండా వైసీపీ నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. కేవలం ఆరునెలల పాలనలో రాష్ట్రాన్ని అభ్యుదయం వైపు నడిపించేందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి లోకేశ్ తదితరులు చేస్తున్న కృషిని ప్రజలు బాగా అర్థం చేసుకున్నారన్నారు. విశాఖలో బుధవారం జరగనున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ రోడ్‌షో, బహిరంగసభలకు జిల్లా నుంచి 40 వేల మందిని తరలించే ఏర్పాట్లు చేశామని మంత్రి కొండపల్లి తెలిపారు. సభకు హాజరైన వారిలో 50 శాతం మంది మహిళలే ఉంటారన్నారు. -మంత్రి వెంట బొబ్బిలి మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలరు ఏగిరెడ్డి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

నిలిచిన భూముల రిజిస్ట్రేషన్లు

కొత్తవలస, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : కొత్తవలస సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మండలంలోని సంతపాలెం, కంటకాపల్లి గ్రామాలకు సంబంధించిన సర్వే నెంబర్లు కంప్యూటర్‌లో ఓపెన్ కాకపోవడంతో రిజస్ట్రేషన్లు నిలిచిపోయాయి. ఎల్‌పీఎం నెంబరులతో కొత్తగా వచ్చిన 1-బీ కాపీల రిజస్ట్రేషన్లు అయ్యేందుకు ప్రభుత్వం వీలు కల్పించడంతో అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలోని భూముల రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. అయితే కొత్తవలస సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో మూడు మండలాల్లోని గ్రామాల వ్యవసాయ భూములు సర్వే నెంబర్లు కంప్యూటర్‌లో ఓపెన్ అవుతున్నప్పటికీ మండలంలోని సంతపాలెం, కంటకాపల్లి గ్రామ రెవెన్యూలకు చెందిన భూముల సర్వే నెంబర్లు ఓపెన్ కావడంలేదు. దీంతో ఆయా గ్రామాల్లోని భూక్రయ, విక్రయదారులు ఇబ్బంది పడుతున్నారు.

నిధులు మంజూరు చేయండి

కొత్తవలస, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : నాయీబ్రాహ్మణ కార్పొరేషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం నిధులను మంజూరు చేయాలని నాయీబ్రాహ్మణ సంఘం డైరెక్టర్ జి.సత్యన్నారాయణ అన్నారు. మంగళవారం కొత్తవలసలో నాయీబ్రాహ్మణ మండల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా తెలగరాపు అప్పారావు, అధ్యక్షుడిగా వడ్డాది శంకరరావు, ఉపాధ్యక్షుడిగా రేగ ప్రసాద్, కార్యదర్శిగా మల్లువలస సత్తిబాబు, సహాయ కార్యదర్శిగా తెలగరాపు దేముళ్లు, కోశాధికారిగా పట్నాల ప్రసాద్, సహా కోశాధికారిగా సతీష్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయీబ్రాహ్మణ అభ్యున్నతి కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలని పిలుపునిచ్చారు.

కామేశ్‌కు ఉత్తరాంధ్ర బాధ్యతలు

విజయనగరం రింగురోడ్డు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రోగ్రెసివ్ సఫాయి కర్మచారి సంఘం జిల్లా అధ్యక్షుడిగా జలగడుగుల కామేష్ ఎన్నికయ్యారు. మంగళవారం కంటోన్మెంట్‌లోని కార్యాలయంలో ఆ యూనియన్ కార్యాలయంలో ఆ సంఘ జాతీయ అధ్యక్షుడు వీర్రాజు నియామక పత్రాన్ని అందజేశారు. కామేష్‌కు జిల్లా బాధ్యతతో పాటు శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లా పర్యవేక్షుడిగా బాధ్యతలు అప్పగించారు.

206 మందికి నేత్ర పరీక్షలు

విజయనగరం దాసన్నపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 22వ డివిజన్ డక్కినవీధి సీతారామ ఆలయం వద్ద టీడీపీ నాయకులు రౌతు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్వామి కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టరు మంచు కుమారస్వామి, డాక్టరు మంచు రవళి సహకారంతో టీడీపీ జిల్లా నాయకుడు పిళ్లా విజయ్‌కుమార్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో 206 మందికి పరీక్షలు నిర్వహించారు. అందులో 68 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో అవనాపు భార్గవిజ్యోతి, వజీ మున్సిపల్ వైఎస్ చైర్మన్ కనకల మురళీమోహన్, గాడు అప్పారావు, కెల్ల సూరిబాబు, ప్రసాద్, తోట రమేష్, శబరీష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు కాంగ్రెస్ నిరసన

నెల్లిమర్ల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలపై ఈనెల 9న నెల్లిమర్లలో నిరసన ప్రదర్శన చేపడతామని కాంగ్రెస్ పార్టీ నెల్లిమర్ల నియోజకవర్గ సమన్వయకర్త గంటా సతీష్ వెల్లడించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజ్యాంగ శిల్పి అంబేడ్కర్‌పై చేసిన సిగ్గుమాలిన వ్యాఖ్యలపై యావత్ భారతదేశం రగిలిపోతోందన్నారు. అమిత్‌షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

నాగమంజరికి అవార్డు

శృంగవరపుకోట రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోట పట్టణానికి చెందిన ప్రముఖ కవయిత్రి గుమ్మ నాగమంజరి జనరంజక అవార్డునకు ఎంపికయ్యారు. గుంటూరు రావిరంగారావు సాహిత్యపీఠం ఆమెకు అవార్డును ప్రకటించింది. వచ్చేనెల 7న గుంటూరులో అన్నమయ్య కళావేదికపై ఆమె అవార్డును స్వీకరించనున్నారు.

రైతులకు రుణాలివ్వండి

నెల్లిమర్ల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతులకు పంట రుణాలు మంజూరుచేయాలని మండల వ్యవసాయాధికారి ఎం.పూర్ణిమ బ్యాంకు అధికారులను కోరారు. బ్యాంకు బాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని సతివాడ, రామతీర్థంల్లోని ఏపీజీవీ బ్యాంకు, నెల్లిమర్లలోని స్టేట్ బ్యాంకు, యూనియన్ బ్యాంకు, డీసీసీబీలకు రైతులతో కలిసి బ్యాంకు మేనేజర్‌లకు వినతిపత్రాలు అందజేశారు.

● శృంగవరపుకోట రూరల్: రబీ సీజన్‌కు సంబంధించి రైతులకు బ్యాంకు రుణాలు ఇవ్వాలని మండల వ్యవసాయాధికారి రవీంద్ర కోరారు. మంగళవారం ధర్మవరం ఎస్‌బీ ఐ బ్రాంచ్ మేనేజర్‌ను కలిసి అర్హులైన రైతుల జాబితాలను అందించారు. కార్యక్రమంలో వీఏఏ రవీచంద్ర తదితరులు ఉన్నారు.

●గరివిడి: అర్హులైన రైతులు, కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయాలని మండల వ్యవసా యాధికారి వి.శైలజ గరివిడిలోని స్టేట్ బ్యాంకు అధి కారులను కోరారు. మంగళవారం బ్యాంకుకు వెళ్లి అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో గరివిడి టీడీపీ పట్టణ నేత జి.సత్తిరాజు ఉన్నారు.

కొనసాగుతున్న నియామక ప్రక్రియ

విజయనగరం క్రైం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో కానిస్టేబుల్ ఉద్యోగ నియామక ప్రక్రియ ఏడో రోజు మంగళవారం కొనసాగింది. 600 మంది పురుష అభ్యర్థులకు గాను 351 మంది మాత్రమే పీఎంటీ, పీఈటీ పరీక్షకు హాజరయ్యారు. ఈ ప్రక్రియను ఎస్పీ వకుల్ జిందాల్, ఏఎస్పీ సౌమ్యలత పర్యవేక్షించారు. ఈ ప్రక్రియలో డీఎస్పీలు శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, యూనివర్స్, వీరకుమార్, బాపూజీ, శ్రీనివాసరావు, థామస్‌రెడ్డి, ఏవో శ్రీనివాసరావు, పలువురు సీఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, పీఈటీలు పాల్గొన్నారు.


ప్రక్రియను పరిశీలిస్తున్న ఎస్పీ

జేఎన్‌టీయూ అభివృద్ధికి ఒప్పందం

విజయనగరం రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని జేఎన్‌టీయూ గురజాడ.. ఐసీటీ అకాడమీతో ఒప్పందం కుదుర్చుకుంది. చెన్నైలోని ఐసీటీ అకాడమీకి మానవ వనరుల నైపుణ్యాలు పెంపొందించడంలో మంచి పేరు ఉంది. అధ్యాపకులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాల ద్వారా బోధనా నైపుణ్యాలను మెరుగుపరచడం, విద్యార్థులకు నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలను అందించి అకాడమిక్ పరిశ్రమల అవసరాల మధ్య ఉన్న అంతరాన్ని తొలగించడం, వ్యాపార సృజానాత్మకతను ప్రోత్సహించడం, యువతను ఆవిష్కర్తలుగా, నాయకులుగా తీర్చిదిద్దడం ఈ ఒప్పందంలోని నిబంధనలు. ఈ ఒప్పందంపై ప్రొఫెసర్ జి.జయసుమ, రిజిస్ట్రార్ జి.శరవణన్, ఎస్.దినకరరెడ్డిలు సంతకాలు చేసి పరస్పరం అంగీకార పత్రాలు మార్చుకున్నారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ వీసీ జి.రాజ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ ఆర్.రాజేశ్వరరావు, నాగరాజుతో పాటు, వైఎస్ ప్రిన్సిపాల్స్, విభాగాధిపతులు, విశాఖ ప్రాంత సంబంధాల మేనేజరు సురేష్ తదితరులు హాజరయ్యారు.


పత్రాలు మార్చుకుంటున్న ప్రతినిధులు

సీహెచ్‌సీని పరిశీలించిన డీసీహెచ్‌ఎస్

భోగాపురం, జనవరి7 (ఆంధ్రజ్యోతి): భోగాపురం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ఆసుపత్రుల సేవల సమన్వయ అధికారి (డీసీహెచ్‌ఎస్) డా.జి.వి.రాజ్యలక్ష్మి మంగళవారం సందర్శించారు. 'ఆసుపత్రికి వెళ్తే బెడ్ షీట్లు తీసుకెళ్లాల్సిందే' శీర్షికతో ఈనెల 4న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. ఆసుపత్రిని, మంచాలను పరిశీలించారు. ప్రస్తుతం మంచాలకు పెయింట్‌లు వేయిస్తున్నామని, ఈనెల 6న బెడ్ షీట్లు వచ్చాయని సీహెచ్‌సీ వైద్యాధికారి వెంకటేష్ ఆమె దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితం కావడంతో ఉన్నతాధికారుల సూచన మేరకు పరిశీలన వచ్చానన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


వైద్యాధికారితో మాట్లాడుతున్న డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రాజ్యలక్ష్మి

ముగిసిన రంగోత్సవ్

నెల్లిమర్ల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి వేణుగోపాలపురం ప్రభుత్వ డైట్‌లో మంగళవారం జిల్లా స్థాయి రంగోత్సవ్ పోటీలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జిల్లాలో పలు పాఠశాలలకు చెందిన 132 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ వేడుకలను డైట్ ప్రిన్సిపాల్ జి.పగడాలమ్మ లాంఛనంగా ప్రారంభించారు. వేడుకల్లో భాగంగా క్విజ్, డ్రాయింగ్, చేతిరాత, రంగోలి, జానపద నృత్యం, ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్‌పై నినాదాలు, రోల్‌ప్లే తదితర అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు ప్రిన్సిపాల్ పగడాలమ్మ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామకృష్ణారావు డి.ఈశ్వరరావు, రవికుమార్, సూర్యారావు, ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్లు ఎల్.రామకృష్ణారావు, కె.కమలకుమారి, మాత రామకృష్ణ, శ్రీనివాస్,సుబ్రహ్మణ్యం, భారతి పాల్గొన్నారు.


నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

టీడీపీలో పలువురి చేరిక

గంట్యాడ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొల్లంకి, గంట్యాడ, బూడిపేట గ్రామాలకు చెందిన పలు కుటుంబాలు వైసీపీని విడిచి మంగళవారం టీడీపీలో చేరాయి. టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావు సమక్షంలో వారు పార్టీలో చేరారు. పొల్లంకి గ్రామానికి చెందిన శిరువూరి సన్యాసిరాజు, అప్పలరాజు, సత్యనారాయణరాజుతో పాటు మరో 9 కుటుంబాలు.. గంట్యాడ గ్రామానికి చెందిన సారిక రామారావు, రఘుమజ్జి రమేష్, లెంక రమణతో పాటు పది కుటుంబాలు టీడీపీ చేరారు. బూడిపేట గ్రామానికి చెందిన గంట్యాడ పంచాయితీ 12వ వార్డు సభ్యుడు వెన్నెల రేవతితో పాటు మరో 25 కుటుంబాలు కొండలరావు సమక్షంలో టీడీపీలోకి వచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రంధి అర్జున మహేశ్వరరావు, అల్లు విజయకుమార్, మురళిరాజు, రంధి చినరామునాయడు, జి.శ్రీనివాసరావు, గంట్యాడ సర్పంచ్ అప్పారావు, మాజీ సర్పంచ్ రఘుమండ లక్ష్మి ఉన్నారు.


కొండలరావు సమక్షంలో టీడీపీలో చేరికలు

వాల్తేరు డివిజన్‌పై ప్రకటన చేయండి

విజయనగరం దాసన్నపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజలు నాలుగు దశాబ్దాలుగా కోరుకుంటున్న రైల్వే జోన్‌కు ప్రధానమంత్రి నరేంద్రమోదీ శంకుస్థాపన చేయడానికి ఏర్పాట్లు చేయడం అభినందనీయమని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ వాల్తేరు డివిజన్‌పై పూర్తిస్థాయి ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. శంకుస్థాపనకు ఏర్పాట్లు జరుగుతున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం జోన్‌కు సంబంధించి సమగ్రమైన ప్రాజెక్టు నివేదిక విడుదల చేయకపోవడానికి కారణం ఏమిటని ప్రశ్నించారు. సమావేశంలో పార్టీ నాయకులు దామోదరరావు, ప్రసాద్, సత్యనారాయణ, రాయ పద్మావతి, నాగభూషణం, దాలినాయుడు, రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జయప్రకాశ్‌నారాయణ్ రాసిన జనబలం పత్రికను విడుదల చేశారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న భీశెట్టి బాబ్జీ

2వేల మందితో సింహాచలానికి పాదయాత్ర

కొత్తవలస, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం సందర్భంగా మంగళపాలెంలోని గురుదేవ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో తరిగొండ వెంగమాంబ భజన బృందంతో పాటు 70 గ్రామాలకు చెందిన గిరిపుత్రులు మంగళవారం నుంచి సింహాచలం వరకు పాదయాత్రగా వెళ్లారు. ఒడిశా , అరుకు, విజయనగరం, విశాఖపట్టణంలోని పలు గిరిజన గ్రామాల నుంచి పెద్దఎత్తున మంగళపాలెం చేరుకుని ఇక్కడ నుంచి పాదయాత్రగా సింహాచలం వెళ్లి వరహానృసింహ స్వామిని దర్శించుకున్నారు. ఏటా ధనుర్మాసంలో పాదయాత్రగా గిరిజనులతో వెళ్లడం ఆనవాయితీ అని ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీశ్‌కుమార్ తెలిపారు.


పాదయాత్రగా వెళుతున్న గిరిజనులు

రాజాం నుంచి 67 బస్సులు

రాజాం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): విశాఖలో ప్రధాని మోదీ బహిరంగ సభకు రాజాం నియోజకవర్గ నుంచి బుధవారం పెద్దఎత్తున జనాన్ని తీసుకువెళ్లేందుకు ఏర్పాట్లు చేశామని ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్ అన్నారు. క్యాంపు కార్యాలయంలో మంగళవారం రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజాం నియోజకవర్గం నుంచి 67 బస్సులతో జనాన్ని తరలించేందుకు ఏర్పాటు చేశామన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోండ్రు

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

కొత్తవలస, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కొత్తవలసలోని బీసీ హాస్టల్ విద్యార్థిని షర్మిల సోమవారం మధ్యాహ్నం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. శృంగవరపుకోటకు చెందిన విద్యార్థిని స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. తనను తోటి విద్యార్థుల్లో కొందరు అవహేళన చేయడంతో మనస్తాపం చెంది దురదలకు రాసుకునే మందు పాఠశాలలో తాగేసింది. విషయం తెలుసుకున్న హెచ్‌ఎం సీహెచ్.ఈశ్వరరావు. షర్మిలను తొలుత స్థానిక పీహెచ్‌సీ తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం విజయనగరంలోని మహారాజా ఆసుపత్రికి తరలించారు. మంగళవారం ఉదయం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న షర్మిలతో సీఐ షన్ముఖరావు మాట్లాడారు. తానే దురదల మందు తాగినట్టు సదరు విద్యార్థిని సీఐకి తెలిపింది. ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ షన్ముఖరావు తెలిపారు.

బాలుడి మృతిపై కేసు నమోదు

విజయనగరం క్రైం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో సోమవారం అర్థరాత్రి హుకుంపేటకు చెందిన మజ్జి జశ్వంత్ (13) నగరంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అనుమానాస్పదంగా మృతి చెందినట్టుగా కేసు నమోదు చేసినట్టు వన్‌టౌన్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. తండ్రి మజ్జి సతీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వైద్యులు డాక్టరు అశోక్, డాక్టరు గాయత్రి, సిబ్బందిపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలకు 6847 దరఖాస్తులు

నెల్లిమర్ల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పీఎంఏవై అర్బన్ 2.0 కార్యక్రమం కింద ఇంటి నిర్మాణం కోసం 6847 మంది దరఖాస్తు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని గృహనిర్మాణ శాఖ జిల్లాప్రాజెక్టు డైరెక్టర్ పి.కూర్మినాయుడు వెల్లడించారు. నెల్లిమర్లలో ఆయన మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. నెల్లిమర్ల నియోజక వర్గానికి సంబంధించి నెల్లిమర్ల అర్బన్ నుంచి 99 దరఖాస్తులు, నెల్లిమర్ల మండలంలోని గ్రామాల నుంచి 346, పూసపాటిరేగ మండలం నుంచి 136, భోగాపురం నుంచి 133, డెంకాడ నుంచి 125 దరఖాస్తులు అందాయన్నారు. ఈ నెలాఖరు వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. సమావేశంలో ఈఈ మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు

రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేయాలి

కొత్తవలస, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్టణంలో సౌత్ కోస్ట్ రైల్వే జోనల్ కార్యాలయ భవనానికి పీఎం మోదీ శంకుస్థాపన చేస్తున్న నేపథ్యంలో ఇక్కడ రైల్వే రిక్రూట్‌మెంట్ బోరు, రిక్రూట్‌మెంట్ సెల్ ఏర్పాటు చేయాలని సౌత్ కోస్ట్ రైల్వే ఓబీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు పెదిరెడ్ల రాజశేఖర్ కోరారు. మంగళవారం కొత్తవలసలో ఆయన మాట్లాడుతూ అలాగే ఇక్కడే స్కిల్ ట్రైనింగ్ కేంద్రాన్ని ప్రారంభించాలన్నారు. ఇక్కడ హెడ్ క్వార్టర్స్‌ను ఏర్పాటు చేసి ఉత్తరాంధ్ర ప్రజల కలను సాకారం చేశారన్నారు. త్వరలోనే ఇక్కడ కూడా జనరల్ మేనేజర్‌ను నియామకం చేసి ఇక్కడే నుంచే కార్యకలాపాలను నిర్వహిస్తారని బావిస్తున్నామన్నారు.

బాలబాలికల అభివృద్ధికి పాటుపడదాం

గరివిడి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): బాలబాలికల సర్వతోముఖాబివృద్ధికి కృషి చేద్దామని ఎంపీడీవో సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఐసీడీఎస్ గరివిడి పీవో ఆరుద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన కిశోర్ వికాస్ ఫేజ్-2 కార్యక్రమంలో ఆరోగ్య, విద్య, సచివాలయ సిబ్బందికి ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ 16, 17 సంవత్సరాల వయస్సులో బాలురు చెడు వ్యసనాలకు అలవాటు పడుతున్నారని, బాలికలు బాల్య వివాహాలు జరుగుతున్నాయన్నారు. ఈ రెండింటినీ అరికట్టేందుకు సమ ష్టిగా కృషి చేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డా.దీప్తి, ఏపీఎం నారాయణరావు, ఈవోపీఆర్‌డీ పుష్పాంజలి ఉన్నారు.

సచివాలయాల తనిఖీ

రాజాం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో సచివాలయ సిబ్బంది అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు హెచ్చరించారు. కంచరాం, రాజయ్యపేట సచివాలయాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈకెవైసీ, హౌస్ హోల్డ్ జియో సర్వే, మిస్సింగ్ సిటిజన్ డేటా ఎంట్రీపై సమీక్ష నిర్వహించారు. అనంతరం హౌస్ హోల్డ్ జియో సర్వేను పరిశీలించారు. సకాలంలో పూర్తిచేయాలని ఆయన ఆదేశించారు.

జిల్లాస్థాయి క్విజ్‌లో శాంతి ఫస్ట్

గజపతినగరం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): భారతీయ విజ్ఞాన మండలి, విజయవాడకు చెందిన సైన్స్ సిటీ నిర్వహించిన కౌశల్ క్విజ్ పోటీల్లో జిన్నాం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పదోతరగతి విద్యార్థి కె.శాంతి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినట్టు ఎంఈవో విమలమ్మ ప్రకటనలో తెలిపారు. అలాగే రాష్ట్రస్థాయిలో డిసెంబరు 30న జరిగిన క్విజ్ పోటీల్లో తృతీయ స్థానం సాధించి ప్రశంసా పత్రంతో పాటు రూ.3వేల నగదు పురస్కారాన్ని శాంతి పొందిందన్నారు. క్విజ్ పోటీల్లో శాంతి ప్రథమ స్థానం సాధించడంపై ఎంఈవో-2 చక్రధరరావు, హెచ్‌ఎం త్రినాథరావు అభినందించారు.

హక్కులపై అవగాహన కల్పించండి

గంట్యాడ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): బాలికలకు హక్కులపై అవగాహన కల్పించాలని తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి సూచించారు. మంగళవారం శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొటారుబిల్లి టీటీడీ కల్యాణ మండపంలో కిశోర బాలిక వికాసంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. బాలికల్లో సామాజిక అంశాలపై అవగాహన కల్పించి చైతన్యం కలిగించాలన్నారు. ఎంపీడీవో రమణమూర్తి మాట్లాడుతూ బాల్య వివాహాల నివారణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలోని ఐసీడీఎస్ పీవో ఉమాభారతి, ఎంఈవో శంకరరావు, ఏపీఎం సులోచనదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఉన్నారు.

స్టడీ అవర్స్‌ను వినియోగించుకోండి

వేపాడ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు స్టడీ అవర్స్‌ను వినియోగించుకోవాలని ఎంఈవో బాలభాస్కరరావు అన్నారు. మండలంలోని సోంపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు నిర్వహిస్తున్న స్టడీ అవర్స్‌ను పరిశీలించారు. ఆయనతో హెచ్‌ఎం రాజు ఉన్నారు.

దివ్యాంగుల పింఛన్ వెరిఫికేషన్

గంట్యాడ, జనవరి7 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు పింఛన్ వెరిఫికేషన్ ప్రక్రియ మంగళవారం రాత్రి మొదలైంది. ముందుగా పెదమజ్జిపాలెం గ్రామంలోని పింఛన్‌దారును డాక్టర్లు పరిశీలించారు. వారి వివరాలును ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. మండలంలోని 29 మంది పింఛన్‌దారులు వెరిఫికేషన్ జరుగుతుందని ఎంపిడివో రమణమూర్తి తెలిపారు.

ల్యాబ్ ఏర్పాటుకు స్థలపరిశీలన

కొత్తవలస, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : సంత మార్కెట్ సమీపంలో మెడికల్ ల్యాబ్ ఏర్పాటు చేయడం కోసం సన్నాహాలు చేస్తున్నాయని జడ్పీ సీఈవో బి.వి.సత్యన్నారాయణ తెలిపారు. మంగళవారం ఆయన సంత మార్కెట్‌ను ఎంపీడీవో ఎస్.రమణయ్య, డీఈ స్వామినాయుడుతో కలిసి పరిశీలించారు.

సంక్రాంతి సందర్భంగా ప్రత్యేక రైళ్లలను నడపనున్న దక్షిణ మధ్య రైల్వే అధికారులు..

చర్లపల్లి టర్మినల్ నుంచి నడుపుతున్న ప్రత్యేక రైళ్ల వివరాలివీ..

ప్రయాణ తేదీ	ట్రెయిన్ నంబరు	ఫ్రమ్ - టు	బయలుదేరు సమయం	చేరుకొనే సమయం
జనవరి 8, 11, 15	02764	చర్లపల్లి - తిరుపతి	18-55	మరుసటి రోజు 07-15
జనవరి 9, 11, 15	02763	తిరుపతి - చర్లపల్లి	16-55	మరుసటి రోజు 06-00
జనవరి 13	07037	వికారాబాద్- కాకినాడ టౌన్	19-40	మరుసటి రోజు 08-30
జనవరి 14	07038	కాకినాడ టౌన్- చర్లపల్లి	20-30	మరుసటి రోజు 08-30
జనవరి 9, 16	07655	కాచిగూడ- తిరుపతి	17-30	మరుసటి రోజు 07-30
జనవరి 10, 17	07656	తిరుపతి- కాచిగూడ	20-05	మరుసటి రోజు 09-30
జనవరి 11, 18	07035	చర్లపల్లి- నర్సాపూర్	19-15	మరుసటి రోజు 05-50
జనవరి 12, 19	07036	నర్సాపూర్- చర్లపల్లి	20-00	మరుసటి రోజు 08-00
జనవరి 12, 19	07078	సికింద్రాబాద్- కాకినాడ టౌన్	10-05	ఆదేరోజు 19-30
జనవరి 12, 19	07079	కాకినాడ టౌన్- సికింద్రాబాద్	22-00	మరుసటి రోజు 08-30
జనవరి 9, 13, 15, 17	07033	చర్లపల్లి- నర్సాపూర్	19-30	మరుసటి రోజు 05-50
జనవరి10, 14, 16, 18	07034	నర్సాపూర్- చర్లపల్లి	20-00	మరుసటి రోజు 08-00
జనవరి 8, 10, 12, 14	07031	చర్లపల్లి- కాకినాడ టౌన్	21-45	మరుసటి రోజు 08-30
జనవరి 9, 11, 13, 15	07032	కాకినాడ టౌన్- చర్లపల్లి	20-30	మరుసటి రోజు 08-35
జనవరి 6, 13	07487	నాందేడ్- కాకినాడ టౌన్	14-25	మరుసటి రోజు 08-10
జనవరి 7, 14	07488	కాకినాడ టౌన్- నాందేడ్	18-30	మరుసటి రోజు 05-10
జనవరి 9, 12, 14	07025	చర్లపల్లి- శ్రీకాకుళం రోడ్	19-20	మరుసటి రోజు 09-00
జనవరి 10, 13, 15	07026	శ్రీకాకుళం రోడ్- చర్లపల్లి	14-45	మరుసటి రోజు 06-00
జనవరి 8	07042	శ్రీకాకుళం రోడ్- కాచిగూడ	14-45	మరుసటి రోజు 07-30

- కుషాయిగూడ, ఆంధ్రజ్యోతి

ఆక్రమణల తొలగింపునకు శ్రీకారం

శృంగవరపుకోట రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముషిడిపల్లిలో భూ ఆక్రమణల తొలగింపునకు మంగళవారం అధికారులు శ్రీకారం చుట్టారు. సర్వేయర్ సాయంతో కొలతలు వేసి అక్రమంగా వెలిసిన నిర్మాణాలపై అధికారులు మార్కింగ్ చేశారు. తాటిపూడి రిజర్వాయర్ భూములను సైతం ఆక్రమించి పక్కా నిర్మాణాలు చేశారని గతంలో పలుమార్లు ఫిర్యాదు చేసి నేపథ్యంలో జేసీ సేతు మాధవన్ స్పందించారు. వారం రోజుల్లో ఆక్రమణలపై విచారణ పూర్తిచేయాలని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. దాంతో మంగళవారం మండల సర్వేయర్ గ్రంధి రాము, ఇరిగేషన్ జే ఈ అమ్మినాయుడు తమ సిబ్బందితో ముషిడిపల్లి చేరుకున్నారు. ఫిర్యాదుదారులతో మాట్లాడి ఆక్రమణలపై ఆరా తీశారు. విజయనగరానికి చెందిన ఓ వైద్యుడు భూమిని ఆక్రమించి ప్రహరీ కట్టినట్టు గుర్తించారు. అందులో 60 సెంట్లు ఇరిగేషన్ భూములతో పాటు 4 సెంట్లు గ్రామకంఠం ఉన్నట్టు గుర్తించి మార్కింగ్ చేశారు. అనంతరం తాటిపూడి ఇరిగేషన్‌లో పనిచేస్తున్న వ్యక్తి ఇరిగేషన్ భూముల్లో ఇళ్లు కట్టాడని ఫిర్యాదు చేయగా దానిపైనా సర్వేచేశారు. సదరు ఉద్యోగి సుమారు రెండు సెంట్లు మేర ఈ స్థలం ఆక్రమించినట్టు గుర్తించారు. పైగా ఆ ఇంటికి అక్రమంగా విద్యుత్ వాడుతున్నట్టు గుర్తించారు. అలాగే పెద్దబందలో కొందరు వ్యక్తులు సుమారు 20 సెంట్లు చెరువును కబ్జా చేసినట్టు గుర్తించి హద్దులు నిర్ణయించారు. .సర్వే పండగ తర్వాత అక్రమ నిర్మాణాలు కూల్చివేస్తామని అధికారులు తెలిపారు. సర్వేలో ఆర్ఐ మనోజ్‌కుమార్, వీఆర్‌వో నాయుడు, సచివాలయం సిబ్బంది, ఫిర్యాదుదారులు, గ్రామపెద్దలు ఉన్నారు.


ఆక్రమణలు గుర్తించి మార్క్ చేస్తున్న దృశ్యం

అనాలోచిత నిర్ణయం
బహుళ అసౌకర్యం

(ఐదో పేజీ తరువాయి)

చేరుకోవడం కష్టమే. అదేవిధంగా భామిని పీఏసీఎస్‌కు సంబంధించి లివిరి వద్ద గోదాము నిర్మించారు. ఆ రహదారి కూడా అంతంతమా త్రంగానే ఉంది.

చెల్లింపు బాధ్యత పీఏసీఎస్‌లదే..

● నాబార్డు నిధులను రుణం రూపంలో అందజేసి ఆప్కాబ్ ద్వారా పీఏసీఎస్‌లకు జమ చేశారు. పీఏసీఎస్‌ల ద్వారా గోదాముల నిర్మాణాలకు చెల్లింపులు చేశారు. కాగా నిర్మాణాల అనంతరం వడ్డీతో సహా నాబార్డుకు పీఏసీఎస్‌లే ఈ రుణాలను తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. నిధులు సమకూర్చని గోదాముల ద్వారా తిరిగి ఎలా రుణాలు చెల్లించాలో తెలియని పరిస్థితుల్లో సహకార సంఘాలు కొట్టుమిట్టాడుతున్నాయి.

● పీఏసీఎస్ అధికారులు పర్యవేక్షణ లేకుండానే బహుళ ప్రయోజన సౌకర్య గోదాములు నిర్మాణం చేపడుతున్నారు. వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో పనులు జరుగుతుండగా.. బిల్లుల చెల్లింపులు మాత్రమే పీఏసీఎస్‌ల ద్వారా చేపడుతున్నారు. ఒక్కో గోదాముకు రూ.40 నుంచి రూ. 60 లక్షల వరకు వెచ్చిస్తున్నారు. కాగా గోదాముల నిర్మా ణంపై పీఏసీఎస్‌ల పర్యవేక్షణ లేకపోవడంతో ఉద్యోగులు పెదవి విరుస్తున్నారు. నిర్మాణాల నాణ్యత ఎలా తెలుస్తుందని ప్రశ్నిస్తున్నారు.

రోడ్లు నిర్మిస్తాం..

బహుళ ప్రయోజన సౌకర్య గోదాముల నిర్మాణం ఇప్పటికే కొన్ని పూర్తయ్యాయి. జనవరి నాటికి కొన్ని, మార్చి నాటికి మిగతావి అందుబాటులోకి వస్తాయి. జిల్లాలోని 20 పీఏసీఎస్‌ల పరిధిలో నిర్మించిన 20 గోదాములకు పూర్తిస్థాయిలో రహదారులు లేవు. ఉపాధి హామీ పథకం కింద రోడ్ల నిర్మాణం చేపట్టి గోదాములకు వాహనాలు వెళ్లే విధంగా చర్యలు చేపడతాం. అందుబాటులోకి వచ్చిన గోదాములను లీజు ప్రాతిపదికన ప్రైవేట్ వ్యక్తులకు ఇచ్చేందుకు చర్యలు చేపడతాం.

- శ్రీరామ్మూర్తి, జిల్లా సహకార సంఘ అధికారి

సహారా ఇండియా చెల్లింపులపై భరోసా ఇవ్వాలి



మాట్లాడుతున్న సహారా ఇండియా బాధితుల సంఘం ప్రతినిధులు

బొబ్బిలి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సహారా ఇండియా డిపాజిట్ల వాపసు, చెల్లింపులపై భరోసా కల్పిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటన చేయాలని ఆ సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. మోదీ విశాఖ పర్యటన నేపథ్యంలో స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సహార ఇండియా బాధితుల సంఘం జిల్లా అధ్యక్షుడు బి.లక్ష్మీదాసు, ఇతర నాయకులు ధనుంజయ్ నాయుడు, పి.శంకరరావు మాట్లాడారు. దేశ వ్యాప్తంగా 13 కోట్ల మంది ఖాతాదారులు 84వేల కోట్ల రూపాయలను దాచుకున్నారని తెలిపారు. వారికి వడ్డీతో కలిపి రూ.3లక్షల కోట్లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. రాష్ట్రంలో కోటిమంది ఖాతాదారుల నుంచి రూ.25వేల కోట్లు సమీకరించిన 80 వేల మంది ఏజెంట్లు నరకయాతనకు గురవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు నరసింహనాయుడు, పాపావు, నాగరాజు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా కార్యదర్శి హౌస్ అరెస్టు



బొబ్బిలి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ బుధవారం విశాఖలో పర్యటించనున్న నేపథ్యంలో బొబ్బిలిలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణను పోలీసులు మంగళవారం హౌస్ అరెస్టు చేశారు. ప్రధాని సభలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు వచ్చి నిలదీసే అవకాశం ఉందన్న సమాచారంతో పోలీసులు వారిని కట్టడి చేసే చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా స్థానిక ఐటీఐ కాలనీలో నివాసముంటున్న ఒమ్మి రమణకు ఎస్ఐ రమేష్, ఏఎస్ఐ టీవీ రమణ నోటీసులు అందజేశారు.

ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోండి

బొబ్బిలి రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణ పరిధిలో ఉన్న లక్ష్మీశ్రీనివాస జూట్ మిల్లు స్థలాల్లో కబ్జాకు గురైన ప్రభుత్వ భూమి సుమారు 2.80 సెంట్లు ఉందని, దానిని వెంటనే రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డీటీకి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఇక్కడ కబ్జా స్థలంలో అప్పట్లో రెవెన్యూ యంత్రాంగం హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. కానీ రెండు రోజుల కిందట కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు హెచ్చరిక బోర్డును తొలగించి మిల్లు ప్రహరీని చదును చేసి లేఅవుట్ చేయడానికి ప్రయత్నాలు కొనసాగిస్తున్నారని ఆయన తెలిపారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న, పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లు క్రియాశీలకంగా పనిచేయాలి

బొబ్బిలి రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం మరింత ఉపయుక్తంగా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకొంటోందని గ్రామాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ తెలిపారు. మంగళవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పలు సూచనలు సలహాలు ఇచ్చారు. రానున్న ఆరు నెలలకు నిర్దిష్ట లక్ష్యాలను ఇస్తారని చెప్పారు. అందులో ఒక్కొక్కరి పనితీరును బేరీజు వేసి భవిష్యత్తులో కొనసాగించడమా, తొలగించడమా అన్నది నిర్ణయిస్తామన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు మరింత క్రియాశీలకంగా పనిచేయాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో లక్ష్మీపతిరాజు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాల యాజమాన్యంపై ఫిర్యాదు

తెర్లాం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ ప్రైవేటు పాఠశాల యాజమాన్యంపై చుక్కవలస గ్రామానికి చెందిన పి.శివదుర్గ అనే మహిళ ఎంఈవో జె.త్రినాథరావుకు మంగళవారం ఫిర్యాదు చేసింది. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తన కుమారుడు హర్ష మండలంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో యూకేజీ చదువుతున్నాడని, అయితే ఉపాధ్యాయులు తరచూ కొడతున్నారని, ఎంతచెప్పినా పట్టించుకోవడం లేదని చెప్పింది. ఫిర్యాదు చేసినందుకు మరింత గట్టిగా చెంపలపై కొట్టారని, దీంతో చెవి నుంచి లాడి కారిందని, వినికిడి లోపం కూడా వచ్చిందని తెలిపింది. ఇప్పుడు తన కొడుకు చెవిటి వాడయ్యాడని ఆమె ఎంఈవోకు ఫిర్యాదు చేసింది. దయచేసి మండల, జిల్లా విద్యాధికారులు సమగ్ర విచారణ జరిపి ఆ పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరింది. ఎంఈవో స్పందిస్తూ ఆ పాఠశాల యాజమాన్యంపై విచారణ జరిపి, తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎడ్ల బండిని ఢీకొన్న లారీ

● ఎద్దు మృతి, ఒకరికి గాయాలు

కొమరాడ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం నుంచి గుమడ గ్రామానికి వస్తున్న ఎడ్ల బండిని వెనుక నుంచి లారీ ఢీకొనడంతో ఒక ఎద్దు మృతి చెందింది. ఇందుకు సంబంధించి ఎస్ఐ నీలకంఠం అందించిన వివరాలిలా ఉన్నాయి. మంగళవారం పార్వతీపురం వైపు నుంచి గుమడ గ్రామానికి వస్తున్న ఎడ్ల బండిని రాయగడ వైపు వెళుతున్న లారీ బలంగా వెనుక వైపు నుంచి ఢీకొంది. దీంతో ఒక ఎద్దు మృతి చెందడమే కాకుండా బండిపై ఉన్న గార గౌరునాయుడుకు గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

ఇది పాఠశాలే!

● రేకుల షెడ్డులో విద్యార్థుల చదువులు
● ఇబ్బందులు పడుతున్న చిన్నారులు
● ఇదీ రుక్మిణిగూడ ఎంపీపీ పాఠశాల పరిస్థితి

సీతంపేట రూరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఇక్కడ మీరు చూస్తున్నది ఒక ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల. సీతంపేట మండలంలోని గిరిశిఖర గ్రామం రుక్మిణిగూడలో ఉన్న ఈ పాఠశాలను గత కొన్నేళ్లగా ఇలాగే నిర్వహిస్తుండడం విచారకరం. ఇక్కడ మొత్తం 12మంది చిన్నారులు విద్యను అభ్యసిస్తున్నారు. రెకుల షెడ్డులో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడిందంటే పైనుంచి నీరు కారిపోతుంటుంది. కనీసం కూర్చొనేందుకు బల్లలు కూడా లేవు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాల భవనం మంజూరు చేయాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నిధులు మంజూరు కాలేదు

ఈ విషయాన్ని ఎంఈవో ఆనందరావు దృష్టికి తీసుకువెళ్లగా, అప్పట్లో నాడు-నేడు పథకంలో భాగంగా పక్కా భవనం కోసం ప్రతిపాదనలు పంపించామని చెప్పారు. కానీ నిధులు మంజూరు కాక పాఠశాల భవన నిర్మాణం జరగలేదని తెలిపారు.



రుక్మిణిగూడలో రేకుల షెడ్డులో నిర్వహిస్తున్న ఎంపీపీ పాఠశాల

రూ.300 కోట్లతో రహదారుల నిర్మాణం

● మంత్రి సంధ్యారాణి

పాచిపెంట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గల ప్రతి గ్రామంలో రహదారుల నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రూ.300 కోట్లు మంజూరు చేశారని రాష్ట్ర గిరిజన సంక్షేమ, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. మంచాడవలస గ్రామంలో 274 మీటర్ల సీసీ రోడ్డును రూ.11లక్షలతో నిర్మించిన రోడ్డును ఆమె మంగళవారం ప్రారంభించారు. సాలూరు నియోజకవర్గానికి రూ.80కోట్లు మంజూరయ్యాయన్నారు. పాచిపెంట మండలంలో 27 రహదారులు పూర్తి చేశామని, ఇంకా 20 రహదారులు ఉన్నాయని చెప్పారు. డోలీ మోతలు లేకుండా ప్రతి గిరిజన గ్రామానికి లింకు రోడ్లు నిర్మిస్తామన్నారు. ప్రతి గ్రామానికి సాగునీరు సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. అనర్హులకు సంబంధించి రాష్ట్రంలో ఐదు లక్షల పింఛన్లు ఉన్నాయని, వాటిపై పరిశీలన చేస్తున్నారని చెప్పారు. ఈ సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు పిన్నింటి ప్రసాద్‌బాబు, నాయకులు ముఖి సూర్యనారాయణ, కొరిపల్లి సురేష్, గూడేపు యుగంధర్, చల్లా కనకబాబు, కొత్తల పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట పేరును పసిడి పంటగా మారుస్తా..

చెప్పుకోవడానికి, వినడానికి అసహ్యంగా ఉన్న పాచిపెంట గ్రామం పేరును పసిడి పంటగా మారుస్తానని మంత్రి సంధ్యారాణి సభాముఖంగా తెలిపారు. ఈ మేరకు తీర్మానం చేసి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. ఈ నిర్ణయం అందరికీ ఇష్టమేనా అని అడగగా, సభలో ఉన్న వారంతా అంగీకారం తెలుపుతూ కరతాళ ధ్వనులతో హర్షం వ్యక్తం చేశారు.



మంచాడవలసలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి

ఆరోగ్యంతో వికాసం



మాట్లాడుతున్న వైద్యురాలు శృతి

కురుపాం, జనవరి7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఆరోగ్యం, పరిశుభ్రత, ఏకాగ్రత వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తాయని ఆర్ఆర్‌బీ పురం పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఎం.శృతి అన్నారు. మంగళవారం స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో సెట్విజ్ సహకారంతో ఎస్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్ తదితర వాటిపై అవగాహన కల్పించారు. వైద్యాధికారిణి శృతి తోపాటు ఏఎస్ఐ రమణ, హెచ్‌ఎం జి.రామగోవింద, ఎస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్, ప్రముఖ రచయిత, ఉపాధ్యాయుడు ఎం.జగదీష్ విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన

పాలకొండ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పాలకొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం బాలల హక్కులు, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మన్యం జిల్లా లీగల్ కం ప్రొఫెషనల్ ఆఫీసర్ పారిశల్ల శ్రీధర్.. బాల్య వివాహం, పీవోసీఎస్‌వో పోక్సో చట్టం, చెడు స్పర్శ, మంచి స్పర్శ, పిల్లల హక్కులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 200 మంది బాలికలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అవుట్ రీచ్ వర్కర్ ఆర్.హరికృష్ణ, సోషల్ వర్కర్ ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి

కురుపాం, జనవరి7(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ సిబ్బందికి సీఆర్‌డీ ఏ నుంచి ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి కోరారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాల యంలో సీఆర్‌డీఏ ఆధ్వర్యంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉపాధి హామీ సిబ్బందికి ఇస్తున్న శిక్షణలో ఎంపీడీవో పాల్గొని, మాట్లాడారు. శిక్షణలో చెప్పిన అంశాలను గ్రామ స్థాయిలో పటిష్ఠంగా అమలు చే యాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో పి.బావాజీ, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

● జియ్యమ్మవలస, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు సీఆర్‌డీఏ ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శంబంగి రమేష్ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో సీఆర్‌డీఏ కమిషనర్ ద్వారా అందిస్తున్న శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను గ్రామ స్థాయిలో అమలయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో కలిశెట్టి శ్రీనివాసరావు, టెక్నికల్ అసిస్టెంట్లు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

మోదీ సభను విజయవంతం చేయండి

● కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి



మాట్లాడుతున్న కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): విశాఖ పట్నంలోని ఆంధ్రా యూనివర్శిటీ మైదానంలో బుధవారం నిర్వహించనున్న ప్రధాని మోదీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కోరారు. మంగళవారం గుమ్మలక్ష్మీపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కూటమి నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. విశాఖ రైల్వేజోన్, మెట్రో జోన్‌కు, అనకాప ల్లిలో ఫార్మాసిటీ తదితర ప్రాజెక్టులకు ప్రధాని శంకు స్థాపన చేయనున్నారని చెప్పారు. ఈసందర్భంగా ఏర్పాటు చేస్తున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. భారీ సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు బయలుదేరి రావాలని కోరారు.

● గరుగుబిల్లి: ప్రధాని మోదీ బహిరంగ సభకు మండలం నుంచి కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి రావాలని రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ అక్కేన మధుసూ దనరావు కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 8న విశాఖలో నిర్వహించనున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ సభను విజయవంతం చేయాలని కోరారు.

విశాఖ చేరుకున్న ఎమ్మెల్యేలు



సభా ప్రాంగణంలో ఎమ్మెల్యేలు విజయచంద్ర, కోండ్రు

పార్వతీపురం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన ఈనేపథ్యంలో పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మంగళవారం విశాఖ చేరుకున్నా రు. ఆయన తోపాటు రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళి కూడా ఉన్నారు.

పంట మార్పిడి పద్ధతులు అవలంబించండి

భామిని, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రైతులు పంట మార్పిడి పద్ధతులు అవలంబించాలని వ్యవసాయ శాఖ జిల్లా వనరుల కేంద్రం కోఆర్డినేటర్ ఆర్.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని లోవగూడ, పోలవరం గ్రామాల్లో ఆయన మంగళవారం పర్యటించారు. జీడి, మామిడి, మొక్కజొన్న, వాతావరణ ఆధార పంటలపై అవగాహన కల్పించారు. జీడితోటల పెంపకంపై అవగాహన కల్పించారు. సీతంపేట ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మొక్కజొన్న జీరోటిల్లేజ్ పద్ధతిలో సాగుచేసి ఆర్థికంగా అభివృద్ధి చేసుకోవాలన్నారు. వ్యవసాయాధికారి కె.సింహాచలం మాట్లాడుతూ చిరుధాన్యాల సాగుపై దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు దుర్గాప్రసాద్, నాగరాజు, భవానీ, ఈశ్వర్, తేజ, జ్యోతి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

మూగజీవాలకు వైద్య సేవలు అందజేయాలి

● పశు సంవర్ధక శాఖ ఏడీ శ్రీనివాసరావు

భామిని, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మూగజీవాలకు వ్యాధి తగ్గేంతవరకు వైద్య సేవలు అందజేయాలని పశుసంవర్ధక శాఖ సీతంపేట ఏడీ బి.శ్రీనివాసరావు సిబ్బందిని సూచించారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'పశువులకు వ్యాధులు, అందని వైద్యసేవలు' అనే కథనానికి ఆయన స్పందించారు. మండలంలోని మణిగ గ్రామాన్ని మంగళవారం సందర్శించి, రైతులతో మాట్లాడారు. గ్రామంలో మూడు రోజుల పాటు సిబ్బందితో పశువులకు చికిత్స అందిస్తామని చెప్పారు. పెంపకందారులు, వైద్య సిబ్బంది సహకరించాలని కోరారు. చుట్టుపక్కల గ్రామాల పెంపకందారులతో సంప్రదించాలని ఆయన సిబ్బందికి సూచించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



రైతులతో మాట్లాడుతున్న ఏడీ

ఆరోగ్య కార్యక్రమాలను పక్కాగా నిర్వహించాలి

● ఘనంగా ఆశా డే

బలిజిపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ స్థాయిలో ఆరోగ్య కార్యక్రమాలను పక్కాగా నిర్వహించాలని వైద్య ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహన్‌రావు అన్నారు. మంగళవారం అరసాడ పీహెచ్‌సీలో నిర్వహించిన ఆశాడే కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. పిల్లలకు సకాలంలో టీకాలు వేయాలని సూచించారు. అంగన్‌వాడీ, పాఠశాలల హెల్త్ స్క్రీనింగులు ఏ మేరకు పూర్తి చేశారని తెలుసుకున్నారు. అనంతరం కుష్ఠువ్యాధి నివారణ కార్యక్రమానికి సంబంధించి బ్యానర్‌ను వైద్య సిబ్బందితో కలిసి ప్రదర్శించారు. వైద్యాధికారి ఎం.శివగాయత్రీ, డీపీఎంవో మూర్తి, సూపర్‌వైజర్లు నారాయణరావు, సత్యవతి, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించాలి

కురుపాం రూరల్ : ఆస్పత్రికి వచ్చిన ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్య సేవలు అందించాలని డిప్యూటీ డీఎం హెచ్‌వో పద్మావతి సూచించారు. మొండెంఖల్ పీహెచ్‌సీని ఆమె మంగళవారం సందర్శించారు. ఈసందర్భంగా ఆశా డే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆశా వర్కర్లకు పలు సూచనలు చేశారు. ప్రెగ్నెన్సీ కిట్లు ఉండేలా చూసుకో వాలన్నారు. అనంతరం ఆసుపత్రి రికార్డులను పరిశీలించారు. వైద్యురాలు ప్రజ్ఞ, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేయాలి

పార్వతీపురం: ఆశ వర్కర్లందరికీ మహిళలకు అంకిత భావంతో సేవలు అందించాలని పట్టణ వైద్యాధికారిణి పి.లావణ్య కోరారు. మంగళవారం జిల్లా కేంద్ర ఆసుపత్రిలో ఆశ వర్కర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్త వైరస్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్యుడు బి.రవిచందర్, సూపర్‌వైజర్ బి.పుష్ప, ఇందిర, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



పార్వతీపురం: మాట్లాడుతున్న వైద్యాధికారిణి లావణ్య

న్యూస్ బాక్స్

పని భారం తగ్గించాలి

బాడంగి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): వావాడ పీహెచ్‌సీలో మంగళవారం ఆశాడే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సభ్యుడు ఎ.సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వం ఆశా కార్యకర్తలపై పనిభారం తగ్గించాలని కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.21వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

రామభద్రపురం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలని ఎంపీడీవో రత్నం, తహసీల్దార్ ఎ.సులోచనారాణి సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఐసీడీఎస్ సీడీపీవో రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కిశోర వికాసం కార్యక్రమంలో వారు పాల్గొని, మాట్లాడారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. ● బొబ్బిలి రూరల్: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో వెల్ఫేర్, హెల్త్, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, ఆశాలకు కిశోర వికాసం పథకంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో పి.రవికుమార్, ఐసీడీఎస్ పీవో విజయలక్ష్మి, ఈవోపీఆర్డీ భాస్కరరా వు, ఎంఈవో వాసుదేవరావు, పీహెచ్‌సీ వైద్యుడు రఘు వంశి, జిల్లా బాలల సమాచారం విభాగం ప్రతినిధి ఎం.వెంకటరావు పాల్గొన్నారు.

శాశ్వత హక్కు కోసం సర్వే

గరుగుబిల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల పరిధిలో నివాసం ఉంటున్న ప్రజలకు శాశ్వత హక్కులు కల్పించేందుకే స్వామిత్వ సర్వేను నిర్వహిస్తున్నామని ఎంపీడీవో జి.పైడితల్లి, ఈవోపీఆర్డీ ఎల్.గోపాలరావు తెలిపారు. వారు మంగళవారం కొత్తూరులో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ కంఠాల్లో నివాసం ఉన్నవారికి ప్రభుత్వ పరంగా పూర్తిస్థాయిలో హక్కులు కల్పిస్తామన్నారు. సర్పంచ్ డి.రజని, కార్యదర్శి ఎ.ప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సారా స్వాధీనం

వీరఘట్టం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వండువ జంక్షన్‌లో మంగళవారం 20 లీటర్ల సారాతో వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ జి.కళానిధి తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, మోటార్ సైకిల్‌ను సీజ్ చేశామని చెప్పారు.

పందెంరాయుళ్ల అరెస్టు

వీరఘట్టం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): నడిమికెల్ల గ్రామ సమీపంలో మంగళవారం ఉదయం పొట్టేలు పందెం నిర్వహిస్తున్న విషయం తెలుసుకున్న ఎస్ఐ జి.కళానిధి తమ సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో నలుగురు పందెంరాయుళ్లను, ఒక గొర్రెపోతును అదుపులోకి తీసుకున్నారు. పందెం ప్రాంతంలో నాలుగు మోటార్‌సైకిళ్లు, రూ.3,020 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ముగిసిన ఔత్సాహిక పారిశ్రామిక-వేత్తల అవగాహన సదస్సు

బలిజిపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సంకల్ప పథకంలో భాగంగా ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో బలిజిపేట మండల సమాఖ్య భవనంలో గత ఐదు రోజులుగా నిర్వహించిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అవగాహన సదస్సు మంగళవారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న 30 మంది యువతీ యువకులకు సర్టిఫికెట్లు అందజేశారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల పరిసరాల్లో ఖైనీ, గుట్కాల అమ్మకం నిషేధించాలి

గుమ్మలక్ష్మీపురం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలోని వివిధ పాఠశాలల పరిసరాల్లో ఖైనీ, గుట్కాలు అమ్మకుండా తగిన చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘం నాయకుడు బిడ్డిక రామారావు ఐటీడీఏ అధికారులకు, పోలీస్‌శాఖకు విజ్ఞప్తి చేశారు. వివిధ ఆశ్రమ పాఠశాలలు, గురుకుల పాఠశాలల సమీపంలో చిన్న చిన్న దుకాణాలు పెడుతూ తినుబండారాలతో పాటు ఖైనీలు, గుట్కాలు, సిగరెట్లు అమ్ముతున్నారని, ఇవి అమ్మకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.